క్లుప్తంగా

రూ. 80 లక్షల మద్యం తాగేశారు

గతేడాది కంటే 20 శాతం పెరిగిన విక్రయాలు

పొన్నూరు: నూతన సంవత్సరంలో మందుబాబులు హడావుడి చేశారు. డిసెంబరు 31, జనవరి 1న మద్యం దుకాణాల వద్ద రద్దీ పెరిగింది. పొన్నూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రెండు రోజుల్లోనే రూ. 80 లక్షలు విలువ చేసే మద్యం తాగారని అంచనా. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పొన్నూరు, కాకుమాను, పెదనందిపాడు మండలాల పరిధిలో 12 వైన్ షాపులు, 2 బార్లు ఉన్నాయి. ప్రభుత్వం మద్యం దుకాణాలలో విక్రయాలకు సమయాన్ని పెంచడంతో దుకాణ యజమానులు డిపో నుంచి రూ. 1.14 కోట్ల విలువ చేసే మద్యం నిల్వలు తెచ్చి పెట్టుకున్నారు. సాధారణ రోజుల్లో సర్కిల్ పరిధిలో రోజుకు సుమారు రూ. 20 లక్షలు విక్రయాలు జరుగుతాయని, పొన్నూరులో సుమారు రూ. 14 లక్షలు, కాకుమాను 3 లక్షలు, పెదనందిపాడు రూ. 3.5 లక్షలు అమ్మకాలు జరిగేవని తెలిపారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని రెండింతల విక్రయాలు రోజుకు రూ. 40 లక్షలు జరిగాయని ఎక్సైజ్ సీఐ రమేష్ తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే 20 శాతం అమ్మకాలు పెరిగాయని, రూ. 6.80 కోట్లు విక్రయాలు జరిగాయన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

కాకుమాను: అసభ్యకరంగా ప్రవర్తించిన ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఏక్‌నాథ్ గురువారం తెలిపారు. ప్రత్తిపాడు మండలం గొట్టిపాడుకు చెందిన జొన్నలగడ్డ రవి కుమార్(28) అనే వ్యక్తి ఈనెల ఒకటో తేది అర్ధరాత్రి మండలంలోని కొమ్మూరులో ఓ ఇంటికి వెళ్లి ఇంటివారితో ఘర్షణకు దిగి అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఆయన తెలిపారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

కాకుమాను: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ డెప్యూటీ సీఈఓ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఎంపీడీఓ యుగకీర్తి గురువారం తెలిపారు. గత కొన్ని నెలల క్రితం కార్యాలయంలోని మినిట్స్ బుక్స్‌లో కొన్ని పేజీలు మిస్ కావడంతో విధి నిర్వహణలో అలసత్వం వహించినందుకు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు ఆమె తెలిపారు.

స్వచ్ఛందంగా చెరువు కట్ట శుభ్రం



గుంటూరు రూరల్: గ్రామంలోని ప్రజలు సమష్టిగా కృషిచేసి చెరువుకట్టను శుభ్రం చేసుకుని వాకింగ్ ట్రాక్‌ను సిద్ధం చేయటం సంతోషకరమని మండలం అభివృద్ధి అధికారి బండి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మండలంలోని చిన్నపలకలూరు గ్రామంలో గ్రామ ప్రజల సహకారంతో గ్రామంలోని చెరువు కట్టపై ఉన్న ముళ్ళ కంపను తొలగించి వాకింగ్ ట్రాక్‌ను వినియోగింలోకి తెచ్చారు. కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు, స్వచ్ఛందంగా ముందుకు రావటం సంతోషకరమని ఎంపీడీఓ తెలిపారు. అనంతరం గ్రామసభను నిర్వహించారు. ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, ప్రజలు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ యూత్ ఫెస్ట్‌లో విజ్ఞాన్ విద్యార్థుల ప్రతిభ



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థులు చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగిన 38వ అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ఇంటర్-యూనివర్సిటీ సౌత్‌జోన్ ఫెస్టివల్ లో సత్తాచాటారని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా బహుమతులు సాధించిన విద్యార్థులకు అభినందన సభను ఏర్పాటు చేశారు. వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన 38వ ఏఐయూ ఇంటర్-యూనివర్సిటీ సౌత్ జోన్ ఫెస్టివల్‌లో తమ విద్యార్థులు మొత్తం 12 బహుమతులను సాధించిన్నట్లు తెలిపారు. వెస్టన్ ఇన్‌స్ట్రుమెంటల్ సోలో, వన్ యాక్ట్ ప్లే, కొలాజ్ కాంపిటీషన్, కల్చరల్ ర్యాలీ, వెస్టన్ వోకల్ సోలో, ఎలక్యూషన్, స్కిట్, మైమ్, ఫోక్ ఆర్కెస్ట్రా, డిబేట్, కార్టూనింగ్, రంగోలి విభాగాల్లో సత్తాచాటి బహుమతులు గెలుపొందారని తెలిపారు. వెస్టన్ ఇన్‌స్ట్రుమెంటల్ సోలో, వన్ యాక్ట్ ప్లే, కొలాజ్ కాంపిటీషన్, కల్చరల్ ర్యాలీ విభాగాల్లో ప్రతిభ విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు కూడా ఎంపికయ్యారని వెల్లడించారు. వీరికి నోయిడాలోని అమిటీ యూనివర్సిటీలో మార్చి 3 నుంచి 7వ తారీఖు వరకు జాతీయస్థాయి పోటీలు ఉంటాయన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులతో పాటు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ తదితరులు అభినందించారు.

లక్ష్యానికి తూట్లు.. చెత్తతో పాట్లు!

- వినియోగానికి నోచుకోని చెత్త సంపద కేంద్రం
- రోడ్డు వెంబడి చెత్త కొండలు.. ప్రజల ఇబ్బందులు
- వల్లభరావుపాలెం గ్రామంలో దుస్థితి



రోడ్డు వెంబడి నిల్వ చేస్తున్న చెత్త

పొన్నూరు: పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్త నుంచి సంపద సృష్టించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఆశించిన మేర ఫలితాలు దక్కడం లేదు. చెత్త నుంచి సంపద సృష్టించేందుకు మండలంలోని పలు గ్రామాల్లో సంపద కేంద్రాలు నిర్మించాయి. గ్రామాల్లో ఇంటింటా వ్యర్థాలు సేకరించేందుకు హరిత రాయబారులను నియమించి కార్యాచరణ రూపొందించారు. చెత్త సంపద కేంద్రాలపై మండల పరిషత్ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో రూ. లక్షల వ్యయంతో నిర్మించిన సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ప్రతి ఊరిలో ఎక్కడికక్కడ రహదారుల పక్కన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఫలితంగా చెత్తకు నిప్పు పెట్టి చేతులు దులుపుకొంటున్నారు.

దృష్టి సారిస్తే ప్రయోజనం..

గతంలో సంపద కేంద్రాలకు చేరిన వ్యర్థాలను తడి, పొడిగా వేరుచేసి ఎరువు తయారు చేసేవారు. దీంతో పంచాయతీలకు కొంతమేరకు ఆదాయం సమకూరేది. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో లక్ష్యం నీరు గారిపోయింది. ఇప్పటికైనా రూ.లక్షల వ్యయంతో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువస్తే పంచాయతీలకు ఉపయోగకరంగా ఉంటుంది.

వల్లభరావుపాలెంలో ఇదీ పరిస్థితి..

మండలంలోని వల్లభరావుపాలెం గ్రామంలో సంపద తయారీ కేంద్రం ఉన్నా వినియోగానికి నోచుకోవడం లేదు. గ్రామంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి సంపద సృష్టించాల్సిన అవసరం ఉన్నా అవి నిరుపయోగంగా మారాయి. దీంతో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను రోడ్డుపై పారవేస్తున్నారు. దీంతో సంపద దూరమై, వ్యాపిస్తున్న దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మండలంలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పొన్నూరు మండలంలో గ్రామాలు	29
జనాభా	63,504
గ్రీన్ అంబాసిడర్ల సంఖ్య	65
పనులు పూర్తయిన కేంద్రాలు	27
సంపద కేంద్రాలకు చెత్త తరలిస్తున్న గ్రామాలు	8



చెత్త సంపద కేంద్రం వినియోగంలో లేక ధాన్యం ఆర బెట్టుకుంటున్న వైనం

చర్యలు తీసుకుంటున్నాం



చెత్త నుంచి సంపద కేంద్రాలు నిర్మాణం పూర్తయిన చోట సంపద సృష్టించేందుకు చర్యలు చేపట్టాం. ఇందుకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. హరిత రాయబారులు తడి, పొడి చెత్త వేరు వేరుగా సేకరించాలని తెలియ జేశాం. వల్లభరావుపాలెంలో రోడ్డు వెంబడి చెత్త నిల్వలు తొలగించి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– డి.మల్లికార్జునరావు, ఈఓపీఆర్‌డీ, పొన్నూరు

పాఠశాలల అభివృద్ధిలో ఎస్ఎంసీల పాత్ర కీలకం



ఎస్ఎంసీ చైర్మన్‌ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ కెనడీ

కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ఎస్ఎంసీల పాత్ర కీలకమని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండలోని అన్ని పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్‌లకు ప్రభుత్వ పాఠశాలలు, వారి బాధ్యతలపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కెనడీ మాట్లాడుతూ ఎస్ఎంసీ చైర్మన్‌లు వారంలో రెండు, మూడు రోజులకు ఒక సారి పాఠశాలలను సందర్శించి పాఠశాలల్లో అమలవుతున్న పథకాలు, మధ్యాహ్న భోజన కార్యక్రమాలను పర్యవేక్షించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు ఉపాధ్యాయులతో పాటు చైర్మన్‌లు కూడా సహకరించాలని ఆయన తెలిపారు. ఎంఈఓ-2 కె.విజయ్ భాస్కర్, హెచ్ఎం బి.సత్యం, ఎస్ఎంసీ చైర్మన్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

చేబ్రోలు: పాఠశాలల అభివృద్ధిలో యాజమాన్య కమిటీ సభ్యులు భాగస్వామ్యులు కావాలని మండల విద్యాశాఖాధికారి రాయల సుబ్బారావు అన్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ప్రాథమిక పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లతో గురువారం శిక్షణా కార్యక్రమం జరిగింది. పాఠశాల యాజమాన్య కమిటీ విధులు, బాధ్యతలపై జరిగిన ఒకరోజు మండల స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఎంఈఓ రాయల సుబ్బారావు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. నారాకోడూరు జడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎం.ఏడుకొండలు, మండల పరిధిలోని 45 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

పొన్నూరులో...

పొన్నూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో పాఠశాల యాజమాన్య కమిటీల పాత్ర ఎంతో కీలకమని ఎంఈఓ కె. శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని నేతాజీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో మండల స్థాయిలో యాజమాన్య కమిటీలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ కమిటీల విధులు, బాధ్యతలు, బాలల హక్కుల పరిరక్షణ, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, సమస్యల పరిష్కారాలు, ప్రజల భాగస్వామ్యం ఎలా ఉండాలనే అంశాలను వివరించారు. రిసోర్స్‌పర్సన్లు కె.లాజరుబాబు, కాగిత రమేష్, మహమ్మద్ అర్షద్, పి.శ్రీనివాసరావు, హెచ్ఎం పి.జయకుమార్, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చేతివృత్తుల వారికి నైపుణ్య శిక్షణ

పొన్నూరు: పట్టణ పరిధిలోని చేతి వృత్తుల (ప్లంబర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, టీవీ మెకానిక్, ఏసీ మెకానిక్, గ్రీసర్ మెకానిక్, బ్యూటీషియన్) వారికి నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మెప్మా సీఎంఎం నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం వారికి సర్టిఫికెట్స్ అందించి హోం ట్రైయాంగిల్ ఫ్లాట్ ఫాం ద్వారా జీవనోపాధి కల్పిస్తారన్నారు. ఆసక్తిగలవారు మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగం, వార్డు పరిధిలోని రిసోర్స్ పర్సన్లు (ఆర్‌పి)ద్వారా ఈ నెల 5వ తేదీ వరకు నమోదు చేసుకోవాలని తెలిపారు. పేర్లు నమోదు చేసుకొనే వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాన్ కార్డుల జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటో తీసుకురావాలని సూచించారు.

సమష్టి కృషితోనే గ్రామాలు అభివృద్ధి

జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్



గొడవర్రు గ్రామసభలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్

చేబ్రోలు: ఐకమత్యంతో, సమష్టి కృషితో గ్రామాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సాయి కుమార్ అన్నారు. చేబ్రోలు మండలం గొడవర్రు, శలపాడు, వేజండ్ల, వడ్లమూడి గ్రామాల్లో గురువారం గ్రామసభలు జరిగాయి. వేజండ్ల గ్రామ సభలో మండల ప్రత్యేకాధికారి ఎం.వందనం మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్లను పరిశీలించి, నిర్వహణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.లలిత, పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరం పరిష్కరించాలి..

పొన్నూరు: రెవెన్యూ సంబంధిత సమస్యలపై ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ జియావుల్‌హక్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన వీఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఇప్పటి వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 608 అర్జీలను స్వీకరించినట్లు తెలిపారు. వాటిలో 162 పరిష్కరించినట్లు, మిగిలిన 446 అర్జీలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డీటీ రాజా రమేష్, సర్వేయర్ సత్యనారాయణ, ఆర్ఐ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ రామారావు, అహ్మద్ వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

మండలంలోని జడవల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి ఆయన 17 అర్జీలను తహసీల్దార్ స్వీకరించారు. మ్యుటేషన్ కోసం1, రిప్లేస్‌మెంట్ పాస్ బుక్ కోసం 4, ఎఫ్ లైన్ 1, అడంగల్ కరెక్షన్ కోసం 1 అర్జీలను వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

రేటూరులో...

రేటూరు(కాకుమాను): రైతులకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో చేపట్టిన రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి.వెంకటస్వామి అన్నారు. మండలంలోని రేటూరు పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు తమ పంట భూములకు సంబంధించిన సమస్యలను సదస్సులలో అర్జీల రూపంలో అందజేసి ఆయా సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈసందర్భంగా వివిధ సమస్యలపై 24 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. మండల సర్వేయర్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామ సభ వెలవెల..



జనం రాకపోవడంతో సచివాలయ ఉద్యోగులు, ఆశా వర్కర్లను కూర్చోబెట్టిన దృశ్యం

పెదకాకాని: గ్రామ సభలను సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని డీఎల్‌పీఓ శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల గ్రామంలో గురువారం రెవెన్యూ గ్రామ సభ జరిగింది. ఈ సభకు గ్రామ సర్పంచి వేల్పుల శ్రావణి అధ్యక్షత వహించారు. సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఎల్‌పీఓ మాట్లాడుతూ గ్రామానికి సంబంధించిన సమస్యలు పరిష్కరించుకునేందుకు ఏర్పాటు చేసిన సభలో ప్రజలు పాల్గొని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు.


జనం లేక..

ఉన్నతాధికారులు విచ్చేసినప్పటికీ పట్టుమని పది మంది కూడా గ్రామ ప్రజలు రాకపోవడంతో సచివాలయం ఉద్యోగులు, ఆశావర్కర్లతో గ్రామసభ నిర్వహించారు. గ్రామసభ నిర్వహణపై పంచాయితీ అధికారులు, సిబ్బంది ఎటువంటి ప్రచారం లేకపోవడం, సమాచారం ఇవ్వకపోవడంతో ప్రజలు ఎవరూ పాల్గొనలేదు. ఈ గ్రామసభలో ఈఓపీఆర్డీ కెల్లంపల్లి శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలకు పుట్టలమ్మతల్లి ఆలయం ముస్తాబు



ఉత్సవాలకు ముస్తాబయిన పుట్టలమ్మతల్లి ఆలయం



పుట్టలమ్మతల్లి అమ్మవారు

గుంటూరు రూరల్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ప్రతిష్టాత్మకంగా ప్రతి ఏటా నల్లపాడు, చల్లావారిపాలెం గ్రామ ప్రజలు నిర్వహించే పుట్టలమ్మతల్లి ఘంటాలమ్మతల్లి ఆలయ సంక్రాంతి ఉత్సవాలు ఈనెల 10వ తేదీనుంచి కనుల పండువగా నిర్వహించనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ ఇంటూరి అంజిరెడ్డి తెలిపారు. ఐదు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాలలో భాగంగా ఈనెల 10, 11వ తేదీలలో డబుల్స్ ఓపెన్ బ్యాడ్మింటన్ ఔట్‌డోర్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నామన్నారు. 12వ తేదీన ఆలయ ప్రాంగణంలో జిల్లా స్థాయి ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలలో విజేతలకు చక్కా శివకుమార్ జనతా సూపర్‌మార్కెట్‌నుంచి, శంకర్ ఎంటర్‌ప్రైజెస్ గ్రంధి శంకరరావులు బహుమతులు అందజేస్తారన్నారు. 13వ తేదీన ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు ఉంటాయని, సాయంత్రం 5 గంటలకు అమ్మవారి బంగారు ఆభరణాల ఊరేగింపు, రాత్రి 8 గంటలకు రేపల్లె వారిచే శ్రీ లక్ష్మిసరస్వతి బుర్రకథ నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. 14వ తేదీన ఉదయం 5 గంటలనుంచి ప్రత్యే పూజలు హోమాలు, అభిషేకాలు, వ్రతాలు, అమ్మవారికి కుంకుమార్చనలు ఉంటాయన్నారు. సాయంత్రం కార్యక్రమాల్లో భాగంగా 6 గంటలకు మునగా సాంబశివరావు ఆధ్వర్యంలో కోలాట బృందం కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. 7 గంటలకు శ్రీ అంకమ్మతల్లి మహిళా బృందం కోలాటం, కేరళ వాయిద్యాలు, కథాకళి, కర్నాటక మహిళ బృందంతో డోలు వాయిద్యాలు, తమిళనాడు మహిళల డప్పు వాయిద్యాలు, తెలంగాణ మహిళల డప్పు వాయిద్యాలతో అమ్మవారి వేషధారణలతో గ్రామంలో అమ్మవారి భారీ ఊరేగింపు జరుగుతుందన్నారు. రాత్రి 8 గంటలకు లడ్డూ వేలంను యడవల్లి నరేంద్ర శర్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. వేలంలో లడ్డూను కైవసం చేసుకున్న భక్తునికి ఇంటూరి వీరారెడ్డి, రాజశేఖర్‌రెడ్డిలు 9 గ్రాముల బంగారు లాకెట్‌ను బహుమతిగా అందజేస్తారన్నారు. 100 అడుగుల విద్యుత్ ప్రభ ఆకర్షణీయంగా నిలవనుందన్నారు. 15వ తేదీన ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు అభిషేకాలు, పూర్ణాహుతి కార్యక్రమం జరుగుతుందన్నారు. రాత్రి 8 గంటలకు మెగా సినీ ఈవెంట్స్ ఆధ్వర్యంలో జబర్‌దస్త్ టీం ప్రత్యేక స్కిట్‌లు, టీవీ సీరియల్ నటుల సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సాయంత్రం అమ్మవారి ప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అమ్మవారి సంక్రాంతి సంబరాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ కోరారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన



పెదకాకాని: తలకు బలమైన గాయాలు తగలకుండా ప్రాణాలు కాపాడటంలో హెల్మెట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సీఐ టీపీ నారాయణస్వామి అన్నారు. పెదకాకాని వై.జంక్షన్‌లో వాహనచోదకులకు హెల్మెట్ వాడకం ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం ద్వారా క్షేమంగా గమ్యానికి చేరుకోవచ్చన్నారు. చిన్నచిన్న కారణాలు చూపించి హెల్మెట్ ధరించకుండా పక్కన పెట్టడం మంచిదికాదన్నారు. వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని హెల్మెట్ ధరించకపోవడం వలన రోడ్డు ప్రమాదాలకు గురైనప్పుడు తలకు బలమైన గాయం తగలడం వల్ల చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. హెల్మెట్ ఉంటే తలకు ఒక రక్షణ కవచంలా ఉపయోగపడుతుందని, రోడ్డు ప్రమాదాలు వలన మరణించే వారిలో ఎక్కువగా తలకు గాయాలై మరణించడం జరుగుతుందని వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అలానే త్రిబుల్ రైడింగ్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడిపితే, వారి మీద చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పెదకాకాని ఎస్ఐ మిరాజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రీజినల్ స్పోర్ట్స్‌మీట్‌లో 'సెయింట్ మేరీస్' సత్తా



విజేతలతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: డిసెంబరు నెలలో గవర్నమెంట్ ఉమెన్స్ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన డిప్లమా రీజనల్ స్పోర్ట్స్ మీట్‌లో తమ కళాశాల విద్యార్థినులు రీజినల్ చాంపియన్స్‌గా నిలిచారని సెయింట్ మేరీస్ ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ రెవరెండ్ డాక్టర్ కేవీ రావు తెలిపారు. గురువారం బుడంపాడులోని సెయింట్ మేరీస్ ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎ.గౌతమి 100 మీటర్ల పందెంలో ప్రథమ బహుమతి, 400మీటర్ల పరుగు పందెంలో జి.రమ్య ప్రథమ బహుమతి, 800 మీటర్ల పరుగు పందెంలో డి.ప్రియాంక రెండవ బహుమతి కైవసం చేసుకున్నారన్నారు. లాంగ్ జంప్, డిస్కస్‌త్రోలో డి.సంధ్య రెండవ బహుమతి, షటిల్ బ్యాట్మింటన్ డబుల్స్‌లో జి.అనిత, పి.తన్మయి మొదటి బహుమతి కైవసం చేసుకుని జనవరి 28, 29, 30 తేదీలలో విశాఖపట్నంలో జరగనున్న స్టేట్ లెవెల్‌మీట్‌కు అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కుమార్, డిప్లమా ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, డిప్లొమా విభాగాధిపతి హారిక, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యం, క్యాంపస్ ఇంచార్జ్ అశోక్, డీన్ అకాడమిక్స్ లత, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శివన్నారాయణ అభినందించారు.


నవనీతాలంకారంలో రంగనాథస్వామి



నవనీతాలంకారంలో దర్శనమిస్తున్న చేబ్రోలులోని రంగనాథస్వామి దృశ్యం

చేబ్రోలు: చారిత్రక ప్రసిద్ధి చెందిన చేబ్రోలులోని రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారు నవనీతాలంకారంలో (వెన్నపూస) గురువారం దర్శనమిచ్చారు. ధనుర్మాసం సందర్భంగా అర్చకస్వాముల బృందం ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. నవనీతాలంకారంలో స్వామి వారు ప్రత్యేక ఆకర్షణలో దర్శనమిచ్చారు. 20కిలోల వెన్నపూసతో స్వామి వారిని అలంకరించారు. ధనుర్మాస పూజలు, తిరుప్పావై కార్యక్రమాన్ని అర్చకస్వాములు బృందం ఆధ్వర్యంలో జరిగింది. సహస్ర తులసి దళార్చన, చతుర్వేద పారాయణం, సామూహిక విష్ణు సహస్ర అర్చన, అష్టోత్తర శతనామావాళి, గోదాదేవిపూజ, అభిషేకాలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. తిరుప్పావై, సుప్రభాతసేవా కార్యక్రమాల్లో భక్తులు, తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంతర విశ్వవిద్యాలయ పోటీలకు సెయింట్ ఆన్స్ విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రావీణ్యత సాధించాలని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ టి.సంధ్య తెలిపారు. గురువారం గోరంట్ల గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థిని అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇటీవల ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో ఏర్పాటు చేసిన అంతరకళాశాలల వాలీబాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచి పి.హారిక అనే విద్యార్థిని విశ్వవిద్యాలయం జట్టులో స్థానం సంపాదించిందన్నారు. జనవరి 5వ తేదీనుంచి 11 వరకు చెన్నైలో జరిగే పోటీలలో ఆమె పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం జట్టులో ఎంపికైన విద్యార్థినిని కళాశాల పీడీ జి.బాలశౌరిరెడ్డి, తదితరులు అభినందించారు.

స్వర్ణోత్సవ సభలను జయప్రదం చేయండి



స్వర్ణోత్సవ మహాసభల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

చేబ్రోలు: జనవరి 5,6,7,8 తేదీలలో జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు కోరారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని ఉపాధ్యాయ భవన్‌లో స్వర్ణోత్సవ మహాసభల ఆహ్వాన పత్రికలను గురువారం ఆవిష్కరించారు. స్వర్ణోత్సవ మహాసభలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు, ఎమ్మెల్సీలు హాజరవుతారని తెలిపారు. సుమారు 20వేల మంది ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం స్వర్ణోత్సవ మహాసభలలో కార్యాచరణ ప్రణాళికను ప్రకటిస్తాయని తెలిపారు. యూటీఎఫ్ నాయకులు కె.విజయరాజు, పార్థసారధి, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వెనిగండ్లలో తాగునీటికి ఇక్కట్లు

పెదకాకాని: మండలంలోని వెనిగండ్ల గ్రామంలో తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ద్వారా గత కొంతకాలంగా ప్రతి రెండు రోజులకు ఒకసారి తాగు నీరు సరఫరా చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా గ్రామంలోని ఎస్టీకాలనీకి తాగునీటి సరఫరా నిలిచిపోగా, మూడు రోజులుగా ముస్లింపాలెంకు నీరు రావడం లేదు. రక్షిత మంచినీటి పథకం ద్వారా నీరు నిల్వ చేసుకునేందుకు విశాలమైన చెరువు, రెండు ఫిల్టర్‌బెడ్‌లు, రెండు వాటర్ ట్యాంక్‌లు, ఫిల్టర్ వాటర్ నిల్వ చేసే సంపు ఉన్నా నీటి సరఫరాలో మాత్రం పంచాయతీ అధికారులు విఫలమవుతూనే ఉన్నారు. గత నాలుగు నెలల కిందట మండలంలో బోరింగ్ పంపులు రిపేరు చేసే వ్యక్తి ఉద్యోగ విరమణ చేయడంతో అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఒక్క బోరింగ్ పంపూ రిపేరుకు నోచుకోలేదు. మూలన పడిన బోరింగ్ పంపులు, సరఫరా కాని తాగునీరు, వాడుకలేని బావులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిరుపేదలు సైతం మినరల్ వాటర్ కొనుక్కొని తాగునీటి అవసరాలు తీర్చుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్య తీర్చాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.